ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక - విజయనగరం సెంట్రల్ రోటరీ క్లబ్ (యువజనోత్సవం సందర్భంగా) నిర్వహించిన చిన్న కథల పోటీలో రెండవ బహుమతి రూ. 316/-లు పొందిన కథ

# కర్తవ్యం

-జిజ్ఞాసి-



అత్యవసర సమయాలలో ఎవరికైనా బ్లడ్ అవసరమయితే నాకు ఫోను చేయడం; నేను ఇవ్వడం పరిపాటే! కానీ ఈ పర్యాయం అపాత్రదానం చేయదలుచుకోలేదు.

పంజాగుట్టలో రిపేర్ చేయాల్సిన ఇ.సి.జి. ఎక్విప్‌మెంట్ రిపేర్ పూర్తిచేసి సాయంత్రం నాలుగ్గంటలవడంతో ఆఫీస్ కెళ్ళి రిపోర్ట్ చేసి ఇంటికెళ్ళి పోదామనుకుంటున్న తరుణంలో ఆఫీస్ బాయ్ వచ్చి చెప్పాడు.

"సార్ అర్ధగంట క్రితం మీకు నిమ్స్ నుండి డాక్టర్ శేఖర్ గారట అర్జంటుగా రమ్మని ఫోన్ చేశారు."

శేఖరూ, నేనూ చిన్నప్పటి నుండి ఒకే స్కూలులో చదివి, ఆ తర్వాత వాడు మెడికల్ సైడూ, నేను బయో మెడికల్ ఇంజనీరింగ్ సైడూ వెళ్ళడంతో కొంత వేరైనా చిన్నప్పటి స్నేహంవల్ల అలాగే మా స్నేహం కంటిన్యూ అవుతూంది. అర్జంటు అంటే బహుశా నా బ్లడ్ గ్రూపు బ్లడ్ కావాలేమో అనుకున్నాను. ఎప్పుడవసరమైనా మా ఫ్రెండ్స్‌లోనే ఎవరికో ఒకరికి ఫోను చేయడం మేం ఇవ్వడం పరిపాటే.

"ఏరా బ్లడ్ అవసరమైతే తప్ప ఫోన్ చేయడం, కలవటం లాంటివి మరచిపోయినట్లున్నావు" విరుచుకు పడ్డాను.

"సినిమాకి వెళ్దామన్నా మాకేదో ఒక అర్జంటు కేసు తగుల్తుంది. మీలాగ టైమ్ టు టైమ్ డ్యూటీ ఆ తర్వాత షికార్లూ, ఖాళీగా కూర్చో వడం కాదురా. మేము వర్క్ మైండెడ్" ఎత్తి పొడుస్తూ సరదాగా అన్నాడు.

"ఏమీ లేదు. ఒక ఆక్సిడెంట్ కేసు. ఆపరేషన్ చేయాలి. నీ బ్లడ్ గ్రూపు సూట్ అవుతుంది. అందుకనే ఫోను చేశాను."

"డాక్టర్, నాన్నగారికి సీరియస్ ఏమీ కాదుకదా!" ఆందోళనగా వచ్చి అడిగాడు ఓ యువకుడు.

"నో ప్రాబ్లమ్ హి విల్ బి ఆల్‌రైట్" సమాధాన పరచాడు శేఖర్.

"మీది పెగడపెల్లి కదూ?" ఆ యువకుణ్ణడిగాను.

## రెండవ బహుమతి రూ. 316లు,పొందిన కథ

స్నేహ భావంతో రక్తదానం చేసేది కొందరయితే, అర్జెన్సీని బట్టి రక్తాన్ని అమ్ముకునే వారు మరికొందరు. కాని మగపిల్లవాణ్ణి కట్న కానుకలకు అమ్ముకునేది ఎందరో!

"అవును సర్" సమాధానమిచ్చాడతడు.

"రెవిన్యూ డిపార్టుమెంట్‌లో పనిచేస్తారు రామ్మోహన్ రాజు అని మీ నాన్న కదూ"

"అవును సర్ మా నాన్న హైదరాబాద్ మా చిన్నాన్న వాళ్ళ దగ్గరకేదో పని మీద వస్తే ఆక్సిడెంటయింది" రూమ్ కెళ్ళాడతను.

"నీకు పేషెంటు తెల్సా" అడిగాడు శేఖర్.

"చాలా బాగా. అందుకే నేను బ్లడ్ డొనేట్ చేయబోవడం లేదు కూడా."

"తెలిసిన మనిషంటున్నావు. అంత చెడ్డవాడా?

లేక మీ ఇంట్లో వాళ్ళకూ అతనికి గొడవలున్నాయా?

ఎంత ఏమి ఉన్నా మానవ ధర్మంరా" ఆదుర్దాగా నచ్చచెప్తూ అన్నాడు శేఖర్.

"మాకు విరోధమేమీ లేదు. కాని భూమ్మీదుండాల్సిన అర్హత కూడా అతనికి లేదు. మొన్న మా బాబాయి కూతురిని వీళ్ళ పెద్దబ్బాయి పెళ్ళి చూపులు చూడ్డానికి వచ్చాడు. మా బాబాయి ఇతని లాగా రెండు చేతులా సంపాదించలేదు. ముందే మేము లక్షకెక్కువ ఇవ్వలేమని మధ్యవర్తికి చెప్పాడు. అయినా సమ్మతమే అని చెప్పి అమ్మాయిని చూసి వచ్చినా ఇంకా డబ్బులు గుంజాలని అన్ని ప్రయత్నాలు చేశాడు. అమ్మాయి, అబ్బాయిలు సమానమే. అందుకని వాళ్ళు ఇంటి నుండి వెళ్ళేప్పుడు వాళ్ళ ఆస్తి హక్కు వాళ్ళకు ఇవ్వడమే న్యాయము. ఎంత అమ్మాయి చదివినా కూతురూ అల్లుళ్ళ జీవితానికి పునాది, జీవితానికి గ్యారంటీ, ఎల్.ఐ.సి. లాంటిది కట్నమివ్వడమనీ, అయినా మీ బిడ్డ కొరకు ఇన్నేళ్ళు కొంచెమైనా కష్టపడలేదానీ వాదన. బ్యాంక్ ఆఫీసర్ సంబంధమంటే బిడ్డ భవిష్యత్తు గొప్పగా వుంటుందనీ, ఏది చేసినా బిడ్డ కొరకే కదా, దాని కోసం కొంత కష్టపడాలనీ, కష్టపడితేనే ఫలమనీ కొత్త సిద్ధాంతాలూ వల్లించాడు, లక్షన్నర తప్పని సరన్నాడు."

"ఈ రోజుల్లో మరి బ్యాంక్ ఆఫీసరంటే ఆ మాత్రం అడుగుతున్నారు కదా" నెమ్మదిగా అన్నాడు శేఖర్.

"అందరూ ఇలాగే ఏదో రీజనింగ్ ఇచ్చుకుంటూ క్రమంగా మానవత్వాన్ని మరచిపోతున్నారు. అయినా అలాంటి వాడు ముందే ఇంత అని చెప్పినప్పుడు ఆలోచించుకుని రావాల్సింది" కోపంగా అన్నాను.

"అయితే నువ్వు బ్లడ్ ఈయనంత మాత్రాన అతనికి దొరకదనుకుంటున్నావా?"

"అదే మనం కట్నం ఇవ్వనంత మాత్రాన ఎవ్వరైనా ఇస్తారు అని మనము, అందరమూ అనుకుంటూనే ఒకరి కొకరు పోటీ అయి క్రమంగా చిన్నప్పటి నుండే పిల్లల కొరకు అని సర్వ అక్రమాలకు పాల్పడుతున్నాము. నేను ఇవ్వకపోతే అతనికి దొరకదని కాదు గానీ, నేను దేశాన్నుద్ధరించలేకపోయినా, ఇంకొకరిని మార్చలేక పోయినా, అపాత్ర దానం మాత్రం చేయను. నా చేతిలో వున్న ఏ వనరులనూ గొప్పగా ఉపయోగించలేకపోయినా ఇవ్వకూడని వ్యక్తుల కివ్వను. చేరకూడని చోటుకు మాత్రం చేరనివ్వను. అందుకే చాలా మంది డాక్టర్లు, సేవాభావంతో రక్తదానం కొందరు చేస్తే ఆ రక్తాన్ని కూడా పీల్చే గుణమున్నట్టు అర్జెన్సీ బట్టి అమ్ముకుంటారని తెల్సి ఎప్పుడు అవసరమో అప్పుడే డైరెక్ట్‌గా నీకే ఇస్తుంటాను. సాధ్యమైనంత వరకు ఏ విషయంలో కూడా అపాత్రదానం చేయను. నేను వెళ్తున్నాను" అని చెప్పి ఆవేశం ఆపుకోలేక విసురుగా వచ్చేశాను.

రెండవ బహుమతి రూ.80 లు
బహుమతి పొందిన కవిత

**'బిచ్చగాడు'**

చదువు రానివాడు
ఇంటింటికీ తిరుగుతున్నాడు
బియ్యం పట్టా పున్నవాడు
ఆఫీసాఫీసుకూతిరుగుతున్నాడు
ఒకడు – ఈ పూట ముద్ద కోసం!
ఇంకొకడు – ప్రతీ పూట ముద్ద కోసం!

– వివేక్




ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 8-10-93